క్లుప్తంగా

గ్రామాల్లో వైద్యశిబిరాలు



వెంకటాపురంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి: మండలంలోని వెంకటాపురం, ఖండ్యాం తదితర గ్రామాల్లో రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరాలు నిర్వహించారు. శిబిరాలకు వచ్చిన ప్రజలకు వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వర్షాలు కురుస్తున్నందున జ్వరాలు, వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



శానిటరీ న్యాప్ కిన్ కిట్లు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

రాజాం: పెనుబాక గ్రామ విలేజ్ క్లినిక్‌లో స్థానిక మహిళలు, కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యసూత్రాలపై బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి సిద్ధేశ్వరి ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ రుతుక్రమ సమయంలో పరిశుభ్రత పాటించడం చాలా అవసరమన్నారు.మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.అనంతరం రాజాంకు చెందిన జీఎంఆర్ వీఎఫ్ అందించిన శానిటరీ న్యాప్ కిన్ కిట్లు పంపిణీ చేశారు. స్థానిక వైద్య సిబ్బంది, జీఎంఆర్‌వీఎఫ్ వలంటీర్లు పాల్గొన్నారు.

సబ్ జైలు సందర్శన



సబ్‌జైలును పరిశీలిస్తున్న న్యాయసేవా సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

బొబ్బిలి: స్థానిక సబ్ జైలును జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి ఏ.కృష్ణప్రసాద్ గురువారం సందర్శించారు. అక్కడి ఖైదీల ప్రవర్తనపై జైలర్ పాత్రోను ఆరా తీశారు. ఖైదీలతో మాట్లాడి న్యాయ సేవల గురించి వివరించారు. అలాగే సబ్ జైలు పరిసరాలు, వంటగది,స్టోర్ రూం, బ్యారక్‌లు, మరుగుదొడ్లను పరిశీలించారు. ఆయన వెంట న్యాయవాదులు సి.హెచ్.ఎల్.వి.ప్రసన్నకుమార్, కె.లక్ష్మునాయుడు, తదితరులున్నారు.

ఉద్యానవన పంటల సాగుకు ప్రోత్సాహం



రేగిడి : ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఎంపీడీఓ శ్యామలకుమారి

రేగిడి: ఉద్యాన వన పంటలు సాగు చేసే రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు ఎంపీడీఓ ఏ.శ్యామలకుమారి తెలిపారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో మండలంలోని ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు మామిడి, కొబ్బరి, జీడి మొక్కలను ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. వీటిని పెంచేందుకు మొదటి మూడేళ్లు ఖర్చులు డబ్బులను చెల్లిస్తామని వివరించారు. ఆ విషయాలను రైతులకు తెలియజేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఏపీఓ ఎస్.హరనాథరావు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 316 మంది ఎంపిక



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

బొబ్బిలి: స్థానిక శ్రీ షిరిడీ సాయి డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. బాడంగి, సీతానగరం, మక్కువ,బలిజిపేట, గజపతినగరం ప్రాంతాల నుంచి 598 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు.వీరికి 19 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి, 316 మందిని ఎంపిక చేశారని ఎస్‌డీఓ ప్రశాంత్ కుమార్, ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు తెలిపారు. అధ్యాపకులు సాంగలి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న మొక్కజొన్న సాగు..!

- రోజురోజుకూ పతనమవుతున్న గిట్టుబాటు ధర
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని ప్రభుత్వం
- నిలిచిపోయిన పెట్టుబడి సాయం, రాయితీపై విత్తనాల పంపిణీ



కొఠారిపురం సమీపంలో సాగులో ఉన్న మొక్కజొన్న పంట

రాజాం: నియోజకవర్గంలో ఈఏడాది రబీ మొక్కజొన్న సాగు విస్తీర్ణం బాగా తగ్గుముఖం పట్టింది. ఖరీఫ్‌తో పాటు రబీలో మంచి ఆదాయ వనరుగా ఉండే ఈ పంటను సాగు చేసేందుకు గతంలో రైతులు ఆసక్తి చూపేవారు. ఖరీఫ్ వరి పంట అనంతరం రబీలో ఎక్కువగా మొక్క జొన్ననే సాగు చేసే వారు. ఎకరానికి 25 క్వింటాళ్లకుపైగా దిగుబడి రావడంతో మంచి లాభాలు ఉండేవి. అయితే ఈ పంటకు ఇటీవల మార్కెట్‌లో డిమాండ్ తగ్గింది. ఫలితంగా ఆ ప్రభావం సాగుపై పడింది. గతంలో విచ్చలవిడిగా సాగుచేసే ఈ పంటపై ఇప్పుడు రైతులు ఆచీతూచి అడుగులువేస్తున్నారు.

గిట్టుబాటులేకనే..

మొక్కజొన్న గింజలకు ప్రస్తుతం ధర తగ్గింది. గత ప్రభుత్వంలో క్వింటాల్ జొన్నపిక్కల ధర రూ. 2400 ఉండేది, ప్రస్తుతం అది రూ. 2,200కు పడిపోయింది. రాజాం నియోజకవర్గంలో రైతులు 2022–23 ఏడాది రబీ సీజన్‌లో 5,476 హెక్టార్లలో ఈ పంటను సాగు చేయగా, 2023–24 ఏడాదిలో 3,800 హెక్టార్లే సాగు చేశారు. ఈఏడాది 3,100 హెక్టార్లకు మాత్రమే పరిమితమైంది. పంటకు ఎక్కువగా తెగుళ్ల ఆశిస్తుండడంతో పాటు, మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడం, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక దళారులనూ ఆశ్రయించాల్సి రావడం, రాయితీపై విత్తనాలు అందించకపోవడం, సాగుపెట్టుబడి సాయం అందకపోవడం, తదితర కారణాలతో ఈ పంటసాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. గతంలో మొక్కజొన్న గింజలను ప్రభుత్వమే కొనుగోలుచేసేది. అలాగే రాయితీపై విత్తనాలు అందించేవారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువైంది. అయితే గిట్టుబాటు ధరలేకనే రైతులు మొక్కజొన్న పంట సాగును తగ్గించారని రాజాం వ్యవసాయ శాఖ ఏఓ రేణుకా సాయి వెల్లడించారు. దళారీలు కూడా మద్దతు ధర ఇవ్వడం లేదని అన్నారు.



నందబలగ సమీపంలో ఆరబెట్టిన మొక్కజొన్న గింజలు

మద్దతు ధర లేదు

గతంలో మొక్కజొన్న పంటకు మంచి డిమాండ్ ఉండేది. దీంతో పంటకు గిట్టుబాటు ధర ఉండేది. ప్రస్తుతం మద్దతు ధర లేదు. దళారులు సిండికేట్‌గా మారి పంటలో నాణ్యతలేదంటూ షాకులు చెబుతున్నారు. అరువు అమ్మకాలు చేయాలి. డబ్బులు రాకుంటే ఏమీచేయలేని పరిస్థితి. అందుకే ఈ ఏడాది మొక్కజొన్నసాగును తగ్గించేశాం.

– కె. రామప్పుడు, రైతు, శ్యాంపురం, రాజాం మండలం.

గత ప్రభుత్వం అండగా ఉండేది

గత ప్రభుత్వంలో రైతులకు రాయితీపై విత్తనాలు అందజేసేవారు. అలాగే ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి పంటను కొనుగోలు చేసేది. ఉచిత పంట బీమా కల్పించి రైతులకు గత ప్రభుత్వం అండగా ఉండేది.మొక్కజొన్న గింజలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండేది. ఫ్యాక్టరీ కంపెనీలు ముందుగానే అడ్వాన్స్‌లు ఇచ్చేవి. ఇప్పుడు పరిస్థితి మారింది.గతంలో మాదిరిగా కొనుగోలుకేంద్రాలు లేవు. దళారులకు విక్రయిస్తే సరైన మద్దతు ధర రావడంలేదు. మొక్కజొన్నకు బదులు అపరాలు సాగుచేశాం.

– ఎన్.రామారావు, రైతు, అంబఖండి, రేగిడి మండలం.

కోర్టు భవన నిర్మాణ పనులు ప్రారంభం

బొబ్బిలి: పట్టణంలోని పాత కోర్టు స్థలంలో నూతన భవన నిర్మాణ పనులను స్థానిక జూనియర్ సివిల్ జడ్జి జి.హేమ స్రవంతి గురువారం ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు భవనాల నిర్మాణానికి అనుమతులు, నిధు లు వచ్చేందుకు కృషి చేశారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో న్యాయ శాఖ సెక్రటరీ, న్యాయమూర్తులు, ప్రభు త్వ కార్యదర్శులను స్థానిక బార్ కార్యవర్గంతో కలిసి నిధులు, పనుల మంజూరుకు చర్యలు తీసుకున్నారు. దీంతో భవననిర్మాణానికి రూ.30కోట్ల పైనే నిధులు మంజూరయ్యాయి. గత ప్రభుత్వంలోనే భవన నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమానికి హై కోర్టు న్యాయమూర్తులు సైతం హాజరయ్యారు. అనంత రం ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పనులు నిలిచిపోయాయి. ఎట్టకేలకు పనులను స్థానిక జడ్జి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎం ఆనందకుమార్, ఆర్.వి.ఎస్. ఎస్.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బి.ఎస్.ఆర్.మూర్తి, మాజీ అధ్యక్షుడు పి.మోహనమురళీకుమార్, జి.జి.కె.ఎస్. శర్మ, న్యాయవాదులు అమరాపు రామకృష్ణ,జాగరపు శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న జడ్జి హేమ స్రవంతి

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మృతి



కర్నేన సూరపు నాయుడు(ఫైల్)

రేగిడి: లక్ష్మీపురం గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కర్నేన సూరపు నాయుడు (హరికృష్ణ) (57) గురువారం మృతి చెందారు. అనారోగ్య సమస్య కారణంగా సూరపునాయుడును కుటుంబ సభ్యులు వారం రోజుల క్రితం విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతిచెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయనకు భార్య రామలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈయన భార్య గతంలో ఎంపీటీసీగా పనిచేశారు. బావమరిది కెంబూరు వెంకటేశ్వరరావు ప్రస్తుతం సర్పంచ్‌గా ఉన్నారు. ఈయన మృతిపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఆ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్, మండల నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

హెచ్‌ఎంల బదిలీ

రేగిడి: మండలంలోని దేవుదల, లక్ష్మీపురం ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు రాజ్యలక్ష్మి, నిమ్మక కృష్ణారావు బదిలీఅయ్యారని ఎంఈఓ ఎం.వి.ప్రసాదరావు గురువారం తెలిపారు. దేవుదల హైస్కూల్‌కు కంచిలి నుంచి ఎస్.సీతారాం నాయుడు, లక్ష్మీపురం హైస్కూల్‌కు వజ్రపుకొత్తూరు నుంచి కామేశ్వరరావు బదిలీపై వచ్చారని ఎంఈఓ చెప్పారు.

సీసీఆర్‌సీ తప్పనిసరి

బొబ్బిలిరూరల్: ప్రభుత్వం అందించే రాయితీలతో పాటు, వ్యవసాయ సంబంధిత పథకాలు వర్తించాలంటే కౌలు రైతులకు సీసీఆర్‌సీలు (పంట సాగు దారు హక్కు పత్రాలు) తప్పనిసరిగా ఉండాలని వ్యవసాయశాఖ ఏడీఏ మజ్జి శ్యామ్ సుందర్ అన్నారు.జగన్నాథపురంలో గురువారం గ్రామసభ నిర్వ హించారు. పంట సాగు దారు హక్కు పత్రాలపై రైతులు, కౌలురైతులకు అవగాహన కల్పించారు.

గుంతలు పూడ్చిన పోలీసులు

సాక్షి ఎఫెక్ట్...

బొబ్బిలి: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మొదలయ్యే రహదారిలో ఉన్న పెద్ద పెద్ద గుంతలను గృహ నిర్మాణ వ్యర్థాలతో పూడ్చి వేసే పనులను ఎస్ఐ వి.జ్ఞానప్రసాద్ తన సిబ్బందితో కలిసి గురువారం చేపట్టారు. కాలేజ్ రోడ్డు, ప్రధాన రహదారులన్నీ గుంతలమయంగా తయారయ్యాయనే వాస్తవిక చిత్రాలతో ఈనెల 25న సాక్షి దినపత్రికలో 'అడుగుకో గుంత..గజానికో గొయ్యి 'శీర్షికతో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. ట్రాక్టర్లతో మట్టి, ఇటుక, సిమెంటు వ్యర్థాలను తీసుకువచ్చి గుంతల్లో పోయించారు.అయితే ఈ గృహ నిర్మాణ వ్యర్థాల వల్ల పెద్ద వాహనాల వారికి పర్వాలేదు కానీ చిన్న వాహనాలు, ద్విచక్రవాహన చోదకులకు ఇబ్బందులు తప్పవని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తానికి గుంతలను పోలీసులు పట్టించుకుని ఏదో చేద్దామనే చర్యలకు ఉపక్రమించడం గొప్ప విషయమేనని స్థానికులు చర్చించుకుంటున్నారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రోడ్డుపై గుంతలను పూడ్చివేయిస్తున్న ఎస్ఐ జ్ఞానప్రసాద్

పక్కాగా పారిశుద్ధ్య నిర్వహణ

బొబ్బిలి: వర్షాలు కురుస్తున్నందున పట్టణంలోని 31 వార్డుల్లోనూ పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సిబ్బందికి సూచించారు. పట్టణంలోని టీబీఆర్ థియేటర్ ఏరియా, టీటీడీ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో గురువారం పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. మురుగు కాలువల్లో పూడిక తొలగించడంతో పాటు రోడ్లపై చెత్త లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, ఎన్విరాన్‌మెంటల్ అధికారి యు.సోమేశ్వరరావు, తదితరులున్నారు.

రాజాంలో..

రాజాం: పట్టణంలోని మెంతిపేట, గాయత్రి కాలనీ, సారధిరోడ్డు, వాసవీనగర్ తదితర ప్రాంతాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ గురువారం యంత్రాలతో పారిశుద్ధ్య పనులు చేయించారు. అలాగే ఆయా వార్డుల్లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.



బొబ్బిలి: టీబీఆర్ ఏరియాలో కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

తెర్లాం: తల్లిదండ్రులు ఐదేళ్లు నిండిన తమ పిల్లల ను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని బూరిపేట గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం నారాయణరావు కోరారు. గురువారం ఆ గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సర్పంచ్ బూరి మధుసూదనరావు, పెద్దలు, జ్ఞాన సరస్వతి యువజన సేవా సంఘం సభ్యులతో కలిసి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు గ్రామంలో అయిదేళ్లు నిండిన పిల్లల ఇళ్లకు వెళ్లి పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలన్నారు. గ్రామంలో గురువారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 18మంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించామని తెలిపారు. అదే గ్రామానికి చెంది, వేరే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు అప్పలస్వామినాయుడు, తవిటి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఇంటింట ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు, సర్పంచ్ మధుసూదనరావు

రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

రామభద్రపురం: రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని రేషన్ డీలర్లను తహసీల్దార్ ఏ.సులోచనరాణి హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాల యంలో రేషన్‌డీలర్లతో సీఎస్ డీటీ ఆర్.సాయికృష్ణతో కలిసి గురువారం సమావేశం నిర్వ హించారు.ఈ సందర్భంగా తహసీల్దార్, సీఎస్‌డీటీ మాట్లాడుతూ ఇకపై రేషన్ సరుకులను పాత విధానంలో రేషన్ దుకాణాల్లోనే చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. రేషన్ లబ్ధిదారుల్లో 65 ఏళ్లు పైబడిన వృద్ధులతో పాటు దివ్యాంగులకు మాత్రం తప్పనిసరిగా ఇళ్ల వద్దకే సరుకులు అందించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రతీ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రోజూ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు సరుకులు పంపిణీ చేయాల్సిందేనన్నారు. అలాగే మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి సరుకులు అందజేయాలన్నారు.ఎండీయూ ఆపరేటర్ల నుంచి ఈపాస్ యంత్రం,కాటా,ఐరిస్ పరికరాలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.



రేషన్ డీలర్లతో సమావేశమైన తహసీల్దార్ సులోచనరాణి

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట, బూసాయవలస గ్రామాల్లో సొంత స్థలంతో పాటు జగనన్న కాలనీల్లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ ఫైనాన్స్ జనరల్ మేనేజర్ పి.వెంకటరమణ గురువారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణాలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జూన్ 12వ తేదీన రాష్ట్రంలో 3 లక్షల గృహ ప్రవేశాలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.గతంలో మంజూరైన ఇళ్లకు సంబంధించి ఎస్సీ, బీసీ లబ్ధి దారులకు రూ.50 వేలు,ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు అదనంగా ఇస్తున్నామని చెప్పారు. పీఎంఈఏవైయూ పథకం కింద మంజూరైన గృహాలను డిసెంబర్‌లోగా నిర్మించాలని, లేకుంటే రద్దవుతాయన్నారు. హౌసింగ్ డీఈ పి.అప్పయ్య, ఏఈ ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆరికతోట జగన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఫైనాన్స్ జనరల్ మేనేజర్ వెంకటరమణ

వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

సంతకవిటి: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు గురువారం చిత్ర లేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు.ఈ పోటీల్లో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. యోగా ఆవశ్యకతపై ఇంగ్లీష్ మీడియంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థిని ఎస్.జోషిత ప్రథమస్థానంలో నిలవగా, విద్యార్థి వై.సూర్యవంశీ ద్వితీయ స్థానంలో నిలిచాడు, తెలుగు మీడియంలో విద్యార్థిను లు పి.రుచిత, కావ్య ప్రథమ, ద్వితీయ స్థానం సాధించారు. చిత్రలేఖన పోటీల్లో విద్యార్థినులు సహస్ర, జశ్విత మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. పోటీలను ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్, ఎంఈఓ జీ.హెచ్.భాస్కరరావు పర్యవేక్షించారు. విజేతలకు అంతర్జాతీయ యోగా డే రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. సత్య సాయి సేవాసమితి సభ్యులు పి.సాయిరాం, వై.శ్రీనివాసరావు, పి.వర్ధన్ పాల్గొన్నారు.



పోటీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు

విదేశాంగ విధానాన్ని ట్రంప్ వద్ద తాకట్టుపెట్టారు

బొబ్బిలి: ఉగ్రవాదాన్ని అంతం చేస్తానని ఆపరేషన్ సింధూర్‌ను ప్రారంభించిన ప్రధానమంత్రి మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పిన వెంటనే సింధూర్‌ను ఆపేయడం మన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని తాకట్టు పెట్టినట్టేనని సీపీఎం పట్టణ అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు అన్నారు. పాక్ ఉగ్రదాడిని ఖండిస్తూ స్థానిక తాపీ పనివారి సంఘ భవనంలో గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడి అత్యంత దుర్మార్గమన్నారు. జాతి, కులమతాల బేధం లేకుండా ప్రపంచ దేశాలన్నీ ఈ దాడిని ఖండిస్తున్నాయన్నారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ ఉగ్రమూకలు ఎక్కడున్నా వెతికి పట్టుకుంటామన్న ప్రధాని మోదీ నేటికీ ఆ నలుగురు ఉగ్రవాదులను పట్టుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు మెరిగాని గోపాలం మాట్లాడుతూ ఉగ్రదాడిని అడ్డం పెట్టుకుని దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం, పీకేఎస్ నాయకులు తమటాల అప్పలనాయుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె. అప్పన్న,ఇఫ్టూ నాయకులు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం బొబ్బిలి పట్టణ అధ్యక్షుడు శంకరరావు

ఆధార్ అనుసంధానం చేసుకోండి

తెర్లాం:

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్న అన్నదాత సుఖీభవ పథకం వర్తించాలంటే రైతులు తమ భూముల ఖాతా లకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ అన్నారు. వెలగవలస గ్రామ సచివాలయంలో గురువారం ఆయన తనిఖీలు చేశారు. సిబ్బంది హాజరు, ఇతర రికార్డులను పరిశీలించి, రెవె న్యూ శాఖకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడు తూ భూముల ఖాతాలకు ఆధార్ నంబర్ అనుసంధానం అయ్యిందీ, లేనిదీ సరిచూసుకోవాలని రైతులకు సూ చించారు. అనుసంధానం కాని వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.అలాగే లోచర్ల, వి.చిన్నయ్యపేట గ్రామ సచివాలయాల్లో ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్‌ఓలు రైతులతో సమావేశాలు నిర్వహించారు.



వెలగవలస సచివాలయంలో మాట్లాడుతున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్

రోడ్డు ఇలా..రాకపోకలు ఎలా..?



చిత్రంలో కనిపిస్తున్నది ఇట్లామామిడిపల్లి, సోంపురం గ్రామాల నుంచి రామభద్రపురం మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు. ఎక్కడికక్కడే గోతులు తేలి రాకపోకలు సాగించలేని విధంగా ఈ రోడ్డు ఛిద్రమైంది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో వాహనచోదకులు మరింత ఇబ్బంది పడుతున్నారు. ఏమాత్రం అజాగ్రత్త గా, ఏమరపాటుగా వాహనాలు నడిపినా ప్రమా దాలకు గురికావడం ఖాయం. ఈరోడ్డు లోనే మండల టీడీపీ కార్యాలయం ఉంది. ఈకార్యాలయం ఎదుట రోడ్డు పూర్తి గా పాడైంది. ఇక్కడి కార్యాలయానికి ఎమ్మెల్యే బేబీనాయన తరచూ వచ్చి వెళుతుంటారు. కానీ ఈ రోడ్డును చూసీ చూడనట్లు పట్టించుకోకపోవడంపై ఈమార్గంలో నిత్యం ప్రయాణించే వారు, వాహన చోదకులు మండిపడుతున్నారు. – రామభద్రపురం

అర్ధంతరంగా నిలిచిన నిర్మాణం

రేగిడి మండలంలోని వండానపేట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణం అర్ధంతరంగా నిలిచి పోయింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నూతన భవనం నిర్మా ణానికి రూ.13.50లక్షలు మంజూరు చేసింది. సంబంధిత కాంట్రాక్టరు శ్లాబ్ దశ వరకు పనులు పూర్తి చేశారు. అప్పటి ప్రభుత్వం రూ.5లక్షలు బిల్లులు చెల్లించిం ది. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం మిగులు నిధులను విడుదల చేయకపోవడంతోనే సంబంధిత కాంట్రాక్టరు పనులు చేయడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో నడుస్తోంది. – రేగిడి



బోరు బాగుచేయరూ..



రామభద్రపురం మేజర్ పంచాయతీ కార్యాలయం పక్కనే పూడి వీధి అంగన్‌వాడీ కేంద్రం ముందు ఉన్న తాగునీటి హ్యాండ్ బోరు పాడైంది. మరమ్మతులకు నోచుకోక కొన్ని నెలలుగా నిరుపయోగంగా ఉంది.బోరు ప్లాట్‌ఫారం చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచాయి. సంబంధిత అధికారులు స్పందించి బోరు బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. – రామభద్రపురం